ఉదయం అయిదు గంటలకే లేచినా, హడావిడి మాత్రం తప్పలేదు చలపతికి. అకారణంగా భార్యను విసుక్కున్నాడు. రోజూ లేటుగా ఆఫీసుకు వెళ్ళడం, మేనేజరుతో చివాట్లు తినడం అతనికి తప్పడం లేదు. గభాలున భార్య ఇచ్చిన టిఫిన్ బాక్స్ అందుకుని, సైకిలు ఎక్కాడు. ఇలా ఎక్కాడో లేదో, సైకిలు వెనక చక్రం టపటపామని కొట్టుకుంటోంది.

అసహనంగా సైకిలు దిగి చూసేడు. ఏముందీ, గాలి లేక టైరు మడతపడిపోయింది. కరువులో అధికమాసం అన్నట్లు – అసలే టైము అయిపోతోందనుకుంటుంటే, అవాంతరం ఒకటా!



# తలుపు సందు సోది

వై. అచ్యుతరామయ్య

సైకిలు నడిపించుకుంటూ తముండే కాలనీ నుంచి మెయిన్ రోడ్డు వరకూ వెడితే తప్ప, సైకిలుకు పాచ్ వేయించడం కుదరదు.

నడిపిస్తున్న ఆ సైకిలు హఠాత్తుగా బరువు పెరిగి పోయినట్లనిపించింది. కొద్ది దూరం నడిపించేసరికే, అతని శరీరమంతా చమటలు పట్టేసాయి. ఎలా గయితేనేం, మెయిన్ రోడ్డు దగ్గరకు వచ్చేసాడు. అదృష్టం బావుంది – సైకిలు రిపేరు చేసే చంద్రం అప్పుడే వచ్చి తన సరంజామా సర్దుకుంటున్నాడు. చలపతిని చూసి రెండు చేతులతో నమస్కారం చేసాడు. అతను తల వూపి, సైకిలును చంద్రం ముందు నిలబెట్టి – ట్యూబు చెక్ చేయమన్నాడు. వెడల్పయిన గిన్నెలో నీళ్ళు పోసుకొచ్చి, చంద్రం పని ప్రారంభించాడు.

"తొందరగా కానీవయ్యా" అంటూ చలపతి విసుక్కుంటున్నాడు. 'వీడు నెమ్మదిగా పాచ్ వేసేసరికి, గంటకుపైగా టైము పట్టేటట్లుంది. ఈ రోజు కూడా బాసుతో తిట్లు తినక తప్పదన్నమాట' అని మనసులోనే అనుకుంటూ నిలబడ్డాడు చలపతి.

ఇంతలో అతని ఆఫీసు మీదుగా వెళ్ళే సిటీబస్సు ఒకటి అప్పుడే వచ్చింది. ఆ బస్సులో బయల్దేరితే, తను టైముకు ఆఫీసుకు అందుకోగలడు. సైకిలు సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చాక తీసుకోవచ్చు.

"చంద్రం! దీనికి పాచ్ వేసి, గాలి కొట్టి రెడీగా వుంచు. సాయంకాలం వచ్చి తీసుకుంటాను" అని చెప్పి చలపతి హడావిడిగా బస్సు వైపు పరిగెత్తాడు.

బస్సు చాలా రద్దీగా వుంది. కొంతసేపటికి కష్టపడి చలపతి ఫుట్ బోర్డు మీది నుంచి లోపలికి చేరుకున్నాడు.

అతని ఆలోచనలు మళ్ళీ తన సైకిలు మీదికి మళ్ళాయి. తను చాలా తెలివితక్కువ పని చేశాడు. కనీసం ఆ చంద్రం ట్యూబు చెక్‌చేసి, ఎన్ని పంక్చర్లు పడ్డాయో తెలుసుకునే వరకయినా అక్కడ వుండాల్సింది. తను సాయంకాలం వెళ్ళేసరికి, వాడు నాలుగో అయిదో పంక్చర్లు పడ్డాయని చెప్పి, ఎనిమిదో, పదో రూపాయిలు గుంజితే? 'అన్ని పంక్చర్లు ఎలా పడతాయిరా?' అని తను వాదించినా, వాడు వేసిన దొంగ పాచ్‌లు చూపించి తన నోరు మూయించగలడు కూడా. డబ్బు కోసం ఇటువంటి వాళ్ళు ఎంత కక్కుర్తి అయినా పడతారు. అందుకే వెధవలకి రోజంతా కష్టపడినా గంజినీళ్ళక్కూడా మొహం వాచిపోతారు.

ఇంతలో ప్రక్కనున్నాయన తన కాలును బూటుతో తొక్కితే, బయట ప్రపంచంలో పడ్డాడు చలపతి. కండక్టరు ఇంకా ఆ చివరనే టిక్కెట్లు ఇష్యూ చేస్తున్నాడు. బస్సును మాత్రం ఆపలేదు. ఆ టైములో బస్సు ఎక్కేవాళ్ళు చాలామంది అర్జంటుగా ఆఫీసులకు వెళ్ళేవాళ్ళే వుంటారు కాబట్టి, వాళ్ళకి ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక, కండక్టరు బస్సును ఆపకుండానే టిక్కెట్లు ఇష్యూ చేస్తున్నట్లున్నాడు.

చలపతి జేబులోంచి రెండు రూపాయిల నోటు తీసుకుని కండక్టరు కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంతలో అతని ఆలోచనలు మరో దారిన పడ్డాయి. కండక్టరు తన దగ్గరకు వచ్చేసరికి మరో రెండు స్టేజీలు దాటిపోతాయి. కండక్టరు ఎప్పుడొచ్చినా, ఆ ముందు స్టేజీలోనే ఎక్కానని చెపితే సరి.

చలపతి రెండు రూపాయిల నోటు జేబులో దాచేసి, రూపాయి నోటు బయటకు తీసాడు. కొంత సేపటికి కండక్టరు తన దగ్గరకి వచ్చాడు. తరువాత స్టేజిలోనే చలపతి దిగాలి. ఇంత దగ్గరకు వచ్చేసాకా టిక్కెట్టు తీయడానికి చలపతికి ఏ మాత్రం మనస్సు అంగీకరించడం లేదు. కండక్టరుతో పాస్ వుందని చెబితే పోలా? కండక్టరు చాలా మంచివాడులా వున్నాడు – తనకు ముందు వున్నవాళ్ళు చాలామంది 'పాస్' అని చెప్పినా, చూపించమని అడగలేదు.

కర్మకాలి, తను దిగవలసిన స్టేజి దగ్గరే టిక్కెట్ చెక్‌చేసే వాళ్ళు వస్తే? ఏమిటో, తను అనవసరంగా భయపడుతున్నాడు. అప్పుడప్పుడయినా చలపతి చాలాసార్లు సిటీ బస్సులో ప్రయాణం చేసాడు. ఎప్పుడూ ఉదయం సమయాల్లో టిక్కెట్ చెకింగు చేయడం తను చూడలేదు.

కండక్టరు ఇంతలో రానే వచ్చాడు. చలపతి రూపాయి నోటును కూడా నెమ్మదిగా జేబులో పెట్టేసుకున్నాడు. "పాస్" అని చెప్పి, బస్సు ఆగిన వెంటనే దిగిపోయాడు.

సాయంకాలం తన కొలీగ్ స్కూటరు మీద వచ్చాడు చలపతి. చంద్రం తన పనిలో నిమగ్నమై వున్నాడు. చలపతి వెళ్ళి, "ఏమోయ్ చంద్రం! ఎన్ని పంక్చర్లు పడ్డాయి?" అన్నాడు అనుమానంగా.

చంద్రం తల పైకెత్తి నవ్వుతూ, "తమరాండి! పంక్చరేం పడలేదండి. గాలి తగ్గిందంతే. చూడండి – పొద్దుట కొట్టిన గాలి ఇంకా అలానే వుంది" అన్నాడు.

చలపతికి ఆశ్చర్యం వేసింది. "ఎంత ఇమ్మంటావ్?" అన్నాడు.

గాలి కొట్టినందుకు, "పదిహేను పైసలివ్వండి" అన్నాడు చంద్రం.

చంద్రం ముందు చలపతి మరుగుజ్జులా ముడుచుకుపోయేడు. నెలకు మూడు వేల రూపాయిలు సంపాదించే తను, రెండు రూపాయిలకు కక్కుర్తిపడి బస్ పాస్ వుందని అబద్ధం ఆడేడు – ఎవరూ ఆ టైములో చెకింగ్‌కు రారనే ధైర్యంతో. అతనికి బుచ్చిబాబు గుర్తుకువచ్చాడు. 'మనల్ని ఎవరూ చూడడం లేదన్న ధైర్యం వున్నప్పుడు ఎన్నో పన్లు చేస్తాం – ఎవరైనా చూస్తే ఎలా వుంటుందో వూహించుకుని, అవకాశం వున్నా ఆ పన్లు చేయడానికి జంకుతాం. తలుపు సందు నీతి మనది'. ఈ మనస్తత్వం తనలాంటి మధ్యతరగతి, ఆ పై తరగతి వాళ్ళలోనే కనిపిస్తోంది.

రోజంతా కష్టపడినా పదిహేను రూపాయిలు సంపాదించలేని చంద్రం ఎంత నిజాయితీగా బ్రతుకుతున్నాడూ! అబద్ధం చెప్పి, డబ్బులు సంపాదించడానికి అవకాశం వున్నా, ఎవరూ అది కనిపెట్టడానికి వీలులేకున్నా – అతనా పని చేయలేదు. శ్రమకు తగ్గ ఫలితాన్ని తప్ప ఎక్కువ ఆశించడం అతనికి తెలియదేమో! ◆


## ధాన్యం

కల్లం నుండి లేస్తూ
బజారు కెళ్ళనని
ధాన్యం మొరాయించింది.

వెళితే ఇక తిరిగి రానని
వెళ్తూ వెళ్తూ నివేదించింది

ఒక వేళ వచ్చినా
నీవు గుర్తు పట్టలేవని
చివరి ఉత్తరంలో
రాసి పంపింది.

ఆ తర్వాత ఊర్లోకి
ఎలాంటి ఉత్తరం రాలేదు



హిందీ మూలం: కేదార్‌నాథ్ సింగ్
అనువాదం: వి.కృష్ణ